క్లుప్తంగా

ముగిసిన హోమం

బంటుమిల్లి: పాశ్చాపురం గ్రామంలోని సువర్చల ఆంజనేయస్వామి దేవాలయంలో రెండు రోజులుగా జరుగుతున్న సుందరాకాండ పారాయణ, హోమం శుక్రవారంతో ముగిశాయి. హనుమత్ జయంతి ఉత్సవాల్లో భాగంగా పురాణ ప్రవచనకర్త నోరి నారాయణమూర్తి హస్తోక్తులతో చేసిన సుందరాకాండ పారాయణం ఆద్యంతం ఆకట్టుకుంది. అనంతరం పండితులు రొంపిచర్ల హనుమంతాచార్యులు, కీర్తిప్రదస్‌ల వేద మంత్రాల మధ్య సుందరాకాండ హోమానికి పూర్ణాహుతి జరిగింది. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

దరఖాస్తుల ఆహ్వానం

మచిలీపట్నంటౌన్: స్థానిక కేంద్రీయ విద్యాలయంలో 2023–24 విద్యా సంవత్సరంలో 11వ తరగతిలో ప్రవేశం కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని విద్యాలయ ప్రిన్సిపాల్ జె. సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు విద్యార్థులు దరఖాస్తులు అందజేయవచ్చునన్నారు. జూన్ 2 నుంచి 9వ తేదీ వరకు కేంద్రీయ విద్యాలయంలో అడ్మిషన్లు నిర్వహిస్తామన్నారు. జూన్ 21వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని చెప్పారు.

జీలుగ విత్తనాలు పంపిణీ

కోనేరుసెంటర్: పెదపట్నం రైతు భరోసా కేంద్రంలో రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. వైఎస్సార్ రైతు భరోసా సలహా మండలి అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు గడిదేశి రాజు అతిథిగా పాల్గొని రైతులకు విత్తనాలను అందజేసి మాట్లాడారు. ప్రభుత్వం సబ్సిడీపై కిలో రూ. 40లకు అందజేస్తోందని, ఈ అవకాశాన్ని ప్రతి రైతు ఉపయోగించుకోవాలని కోరారు. రైతు భరోసా కేంద్రం వ్యవసాయ సహాయకురాలు ప్రవల్లిక, గ్రామ కార్యదర్శి శ్రీహరి, రైతులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ లీకులకు మరమ్మతులు చేయించండి

పెడన: పట్టణంలోని బంటుమిల్లి రోడ్డు ఏడో వార్డులో ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే తాగునీటి పైపు లైను లీకు అవుతోంది. స్థానికులు ఈ విషయాన్ని వార్డు కౌన్సిలర్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ కటకం ప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఆయన మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ ఏఈలతో మాట్లాడి తక్షణం లీకును అరికట్టి తాగునీటిని సరఫరా చేయాలని కోరారు.

విద్యార్థులకు సన్మానం

పెడన: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని, విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని పెడన ఎస్‌ఐ వి. రవిచంద్రకుమార్ అన్నారు. గౌడపాలెం జింజేరు గ్రామంలో గురువారం రాత్రి మన ఊరు– మన అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గౌడపాలెం జింజేరు గ్రామం నుంచి పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఎస్‌ఐ రవిచంద్రకుమార్ సన్మానించారు. మెమెంటోలు, డిక్షనరీలు, ప్రతిభా పురస్కారాలను అందజేశారు. సర్పంచ్ వేముల సత్యనారాయణ, కమిటీ ప్రతినిధులు తాతా విఠల్, పామర్తి రాముడు, మట్టా వెంకన్న, కట్టా ఏడుకొండలు, హరికృష్ణ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

కోడూరు: కోడూరుకు చెందిన రేపల్లె నవ్య ప్రమాదంలో కాలు కోల్పోయి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందింది. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.1.75 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును స్థానిక పార్టీ కార్యాలయం వద్ద బాధితురాలి భర్త రేపల్లె వెంకట సుబ్బారావుకు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు శుక్రవారం అందజేశారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, ఎంపీపీ కొండవీటి వెంకట కుమారి పాల్గొన్నారు.

పచ్చిరొట్టతో భూసారం పెంపు

కృత్తివెన్ను: పచ్చిరొట్ట విత్తనాలు నేలను సారవంతం చేయడంలో ముఖ్యభూమిక పోషిస్తాయని వ్యవసాయ శాఖ ఏఓ జెన్నీ అన్నారు. శుక్రవారం సీతనపల్లి సచివాలయం వద్ద మండల వ్యవసాయ శాఖ సలహా సమావేశం నిర్వహించారు. జెడ్పీటీసీ మైల రత్నకుమారి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులకు 50 శాతం సబ్సిడీపై జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు.

పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

గూడూరు: ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై సరఫరా చేస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను సద్వినియోగించుకోవాలని గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు రైతులను కోరారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం సబ్సిడీపై సరఫరా చేస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను శుక్రవారం గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో రైతులకు పంపిణీ చేశారు.

విద్యార్థులకు పాటలు, డ్యాన్స్‌లో శిక్షణ

అవనిగడ్డ: స్థానిక గ్రంథాలయంలో శుక్రవారం విద్యార్థులకు పాటలు పాడటం, డాన్స్ చేయడంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. పలు గీతాలతో పాటు భగవద్గీత శ్లోకాలు, డ్యాన్స్ నేర్పించారు. ఉపాధ్యాయులు పి. తులసీరామ్, ఆంజనేయులు, భగవద్గీత శిక్షకులు శేషగిరిరావు, గ్రంథాలయ అధికారి ఎస్ ప్రభుదాస్ పాల్గొన్నారు.

ఘంటసాలలో..

ఘంటసాల గ్రంథాలయంలో విద్యార్థులకు పలు విభాగాల్లో శిక్షణ ఇచ్చారు. బొమ్మలు వేయడం, పుస్తకాలు చదవడం, కథలు చెప్పడం నేర్పించారు. హెచ్ఎం జె. శ్రీనివాసరావు, డి. నాగరాజు శిక్షణ ఇవ్వగా గ్రంథాలయాధికారి ఎం. శరత్‌కుమార్ పర్యవేక్షించారు.

మార్మోగిన హరి నామస్మరణ

- వేదఘోషతో పులకించిన ఉల్లిపాలెం
- మహా కుంభాభిషేకానికి తరలివచ్చిన భక్తులు
- జనసంద్రంగా మారిన గ్రామ వీధులు
- తెలుగు రాష్ట్రాల నుంచి లక్షమందికి పైగా భక్తుల రాక



కుంభాభిషేక జలాలను ఊరేగిస్తున్న పండితులు



శ్రీమన్నారాయణుడి మూలమూర్తికి ప్రత్యేక పూజలు చేస్తున్న పండితులు

కోడూరు: అభినవ మేల్కోటగా పేరుగాంచిన ఉల్లిపాలెం గ్రామం హరి నామ స్మరణతో మార్మోగింది. గ్రామంలోని గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణ స్వామి వారి ఆలయం నిర్మించి పుష్కరకాలం పూర్తి కావడంతో శుక్రవారం మహా కుంభాభిషేక మహోత్సవం నిర్వహించారు. తెలుగు రాష్ట్రాలతో పాటు బెంగళూరు, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు పోటెత్తారు. ఉల్లిపాలెం గ్రామం భక్తజనసంద్రంగా మారింది. వేకువజామున 4 గంటల నుంచి గ్రామ వీధులు వేదఘోషతో పులకించాయి. ప్రత్యేకంగా నిర్మించిన యాగశాలలో 50 మంది రుత్వికుల మంత్రవచనాల నడుమ ప్రత్యేక హోమాలు, యంత్ర పూజలు భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఉదయం 6.50 గంటలకు అష్టాక్షరీ పీఠాధిపతి త్రిదండి అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజీయర్ స్వామీజీ పర్యవేక్షణలో ఐదు హోమ గుండాల ద్వారా మహా పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

శిఖరం, స్వామివార్లకు మహా కుంభాభిషేకం..

వారం రోజుల నుంచి యాగశాలలో పూజలు నిర్వహించిన ప్రత్యేక జలాలకు సంబంధించిన కలశాలను భక్తుల హరినామస్మరణ మధ్య ఆలయ మాడ వీధులు వెంట ఊరేగించారు. ఈ జలాలతో గర్భాలయంలోని శ్రీమన్నారాయణుడు, రాజ్యలక్ష్మీ, గోదాదేవి అమ్మవార్లకు అభిషేకించారు. అనంతరం గర్భాలయంపై ఉన్న ప్రధాన విమాన గోపుర శిఖరంపై మహా కుంభాభిషేకాన్ని కనుల పండువగా నిర్వహించారు. స్వామివార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేక పల్లకీపై ఊరేగించారు. ఉత్సవాలను తిలకించేందుకు లక్ష మందికి పైగా భక్తులు తరలివచ్చారని ఆలయ కమిటీ ప్రకటించింది.

ఆకట్టుకున్న మూలమూర్తుల అలంకారం..

కుంభాభిషేకాన్ని పురస్కరించుకొని శ్రీమన్నారాయణుడి 11 అడుగుల మూలమూర్తికి చేసిన అలంకారం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. వజ్రవైడూర్యాలతో పొదిగిన ఆభరణాలను స్వామివారికి ధరింపజేశారు. మకరతోరణానికి నూతనంగా ఇత్తడి తొడుగును ఏర్పాటు చేశారు. రాజ్యలక్ష్మీ, గోదాదేవి అమ్మవార్లను కూడా ప్రత్యేక ఆభరణాలతో అలంకరించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బూరగడ్డ హరినాథ్‌బాబు, మద్దాళి ప్రసాద్, జూపూడి సుభాష్ చంద్రబోస్ తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు.

లక్షమందికి అన్నసమారాధన..

కోడూరు: ఉల్లిపాలెంలోని గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణ స్వామి వారి ఆలయం వద్ద జరిగిన మహా కుంభాభిషేకాన్ని పురస్కరించుకొని శుక్రవారం లక్షమందికి మహా అన్నసమారాధన నిర్వహించారు. అన్నసమారాధనను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు–కెప్టెన్ లక్ష్మీ దంపతులు ప్రారంభించారు. విజయవాడ, దివిసీమ, మచిలీపట్నానికి చెందిన వాసవీ క్లబ్ సభ్యులతో పాటు గ్రామ యువత అన్న సమారాధనలో పాల్గొని సేవలందించారు.



మహా అన్నసమారాధనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు దంపతులు

అష్టభుజ ఏకాదశి మండపం ప్రారంభం..

శ్రీమన్నారాయణుడి ఆలయం పక్కనే రూ.1.10 కోట్లతో నూతనంగా నిర్మించిన అష్టభుజ ఏకాదశి మండపాన్ని మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్-విజయలక్ష్మీ దంపతులు ప్రారంభించారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, మాజీ ఉపసభాపతి బుద్ధప్రసాద్ దంపతులు స్వామివార్లను దర్శించుకొని పూజలు చేశారు. అష్టాక్షరీ స్వామీజీ రమేష్‌బాబు, బుద్ధప్రసాద్ దంపతులను శేషవస్త్రాలతో సత్కరించి ఆశీర్వచనాలు అందించారు. అనంతరం భక్తులతో మాట్లాడి స్వామివారి ఊరేగింపులో పాల్గొన్నారు. ఉత్సవాల్లో ఏవిధమైన అవాంఛనీయ ఘటనలు జరుగకుండా అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ పర్యవేక్షణలో సీఐ, ఎస్‌ఐలు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఉత్సవాలు విజయవంతం కావడంతో సహకరించిన అధికారులను ఆలయ కమిటీ దుశ్శాలువాలతో సత్కరించింది.

కనుల పండువగా శ్రీమన్నారాయణుడి కల్యాణం..

కోడూరు: గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణ స్వామి వారి మహా కుంభాభిషేక ఉత్సావాల్లో భాగంగా శుక్రవారం స్వామివార్ల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ నిర్మాణకర్త త్రిదండి అష్టాక్షరీ సంపత్ కుమార రామానుజీయర్ స్వామీజీ పర్యవేక్షణలో భక్తులు స్వామి వార్లను ప్రత్యేక పల్లకీలో ఊరేగిస్తూ కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చారు. నల్లగొండ, కర్నూలు, నకిరేకల్లు, విజయవాడకు చెందిన పది మంది దంపతులు ఉభయ దాతలుగా వ్యవహరించారు. హైదరాబాద్‌కు చెందిన వేద పండితుల బృందం కల్యాణ తంతును జరిపారు. అష్టాక్షరీ స్వామీజీ కల్యాణంలోని ఘట్టాలను, స్వామివార్ల, అమ్మవార్ల గుణగణాలను వివరించిన తీరు ఆకట్టుకుంది. కుంభాభిషేక ఉత్సవాల వల్ల కలిగే ఫలితాలను స్వామీజీ వివరించారు. కల్యాణంలో పాల్గొన్న దంపతులను శేషవస్త్రాలతో సత్కరించారు. అనంతరం కల్యాణమూర్తులకు గరుడవాహనంపై నగరోత్సవం నిర్వహించారు. మెరకగౌడపాలెం, వేణుగోపాలపురం గ్రామాలకు చెందిన భక్తబృందాల సభ్యులు నిర్వహించిన కోలాట భజనలు ఆకట్టుకున్నాయి.



ప్రత్యేక అలంకరణలో కల్యాణమూర్తులు

స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించాలి

కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో పర్యావరణ పరిరక్షణ కోసం స్వచ్ఛభారత్ వంటి కార్యక్రమాలను నిర్వహించాలని, ఇందులో ప్రజలను భాగస్వాములను చేయాలని కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం క్యాంపు కార్యాలయం నుంచి క్షేత్ర స్థాయి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు కార్యక్రమాలు చేపట్టాలని మార్గదర్శకాలు జారీ చేశాయన్నారు. ఇందులో భాగంగా సముద్ర తీరాలు పరిశుభ్రంగా ఉంచాలని, గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. మొక్కలు నాటే కార్యక్రమంతో పాటు పలు పర్యావరణహిత కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రత్యేక పోర్టల్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, అందులో నిర్వహించిన కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలను అప్‌లోడ్ చేయాలన్నారు. పంచాయతీ, మునిసిపల్ అధికారులతో పాటు ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల వాడకాన్ని నిషేధించడంతో పాటు మురుగు కాలువలను శుభ్రపరచడం వంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ నెల 21వ తేదీన మంగినపూడి సముద్రతీరంలో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జిల్లాలో గురువారం 125 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న పంటను కొనుగోలు చేశామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో దెబ్బతిన్న మొక్కజొన్న, జొన్న పంట నష్టం వివరాలను నమోదు చేయాలని చెప్పారు. స్పందన, జగనన్నకు చెబుదాం అర్జీల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, వీటి పరిష్కారానికి శ్రద్ధ చూపాలన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జేసీ అపరాజితసింగ్, డీఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, అధికారులు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వంలోనే రైతులకు మేలు

ఎమ్మెల్యే పేర్ని నాని



రైతులతో మాట్లాడుతున్న పేర్ని నాని. చిత్రంలో జేసీ అపరాజితసింగ్

చిలకలపూడి(మచిలీపట్నం): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎల్లప్పుడు రైతులకు మేలు చేసే విధంగా పరిపాలన చేస్తున్నారని బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాల్‌లో మచిలీపట్నం పోర్టు నిర్మాణానికి సంబంధించి రోడ్డు, రైలు మార్గానికి భూ సేకరణ రెండో దశ భూ యజమానులతో శుక్రవారం సమావేశమయ్యారు. ఏ రైతుకు ఎంత భూమి ఉన్నది, ఆ ప్రాంతంలో ప్రస్తుతం ఉన్న మార్కెట్ ధర తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు కావాల్సిన ధర వివరాలపై ఆరా తీశారు. భూ సేకరణలో భూములు కోల్పోయిన యజమానులకు తమ ప్రభుత్వం ఎప్పుడూ ఆమోదయోగ్యమైన ధరను చెల్లించి తీసుకుంటుందని, రైతులు ఎటువంటి అపోహలు పడాల్సిన అవసరం లేదన్నారు. జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్ మాట్లాడుతూ 2013 భూ సేకరణ చట్టం ప్రకారం మార్కెట్ ధరకు అనుగుణంగా రైతుల నుంచి సేకరిస్తున్న భూమికి ధర కల్పిస్తామన్నారు. రైతులు వారి భూములకు కావాల్సిన ధరను కూడా పరిగణనలోకి తీసుకుని ఉన్నతాధికారులతో చర్చించి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. బందరు ఆర్డీఓ ఐ. కిషోర్, తహసీల్దార్ డి. సునీల్‌బాబు, కలెక్టరేట్ భూ విభాగం సూపరింటెండెంట్ రాధిక, మేకవానిపాలెం సర్పంచ్ మేకా లవకుమార్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పిప్పళ్ల నాగబాబు, రైతులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరం

మచిలీపట్నంటౌన్: ధ్యానం.. కథలు.. నృత్యాలు తదితర కార్యక్రమాలతో చిన్నారులు ఉత్సాహంగా గడుపుతున్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో భాగంగా స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. శుక్రవారం ధ్యానం, కథలు చెప్పటం, భగవద్గీత శ్లోకాలు, దేశభక్తి గీతాలు నేర్పించారు. ఎం. విజయ విద్యార్థులతో ధ్యానం చేయించారు. ఓలేటి ఉమా సరస్వతి దేశభక్తి గీతాలు రాయించి పాడించారు. గణితంలోని మెలకువలను నేర్పారు. ఐదో రోజు జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈడేపల్లి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులతో డ్రాయింగ్ మాస్టర్ శేషగిరిరావు డ్రాయింగ్ వేయించారు. విద్యార్థులు ఆటపాటలతో పాటు నృత్యాలు చేస్తూ ఆనందంగా గడిపారు. మౌనిక హనుమాన్ చాలీసా నేర్పించారు. సత్యనారాయణ మాస్టారు విద్యార్థులకు యోగా, ధ్యానం నేర్పించారు.

వాడీవేడిగా మండల పరిషత్ సమావేశం

చల్లపల్లి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. శుక్రవారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కోట విజయ రాధిక అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మంగళాపురం సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు గ్రామ నడిబొడ్డున ఉన్న ఊర చెరువును తాగునీటి చెరువుగా అభివృద్ధి చేస్తున్న నేపథ్యంలో గట్టుపై పందుల పాకలు తొలగించాలని కోరారు. డెప్యూటీ తహసీల్దార్ కుమార్ స్పందిస్తూ ఎస్టీ కమిషన్ ఆదేశాల మేరకు పందుల పెంపకందారులకు పునరావాసం కల్పించాల్సి ఉందని, అప్పటి వరకు వారిని తొలగించే అవకాశం లేదన్నారు. మంగళాపురం పశు వైద్యశాల ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితిలో ఉన్నందున నూతన భవనం నిర్మించాలని, తాము స్థలం కూడా కేటాయించామని సర్పంచ్ నాగేశ్వరరావు కోరగా మండల పశు వైద్యాధికారి డాక్టర్ మనోజ్ స్పందిస్తూ స్థలానికి పొజిషన్ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉందన్నారు. మండల పరిషత్ సమావేశానికి సక్రమంగా రాని అధికారులపై చర్యలకు సిఫార్సు చేయాలని ఎంపీపీని కోరారు. విద్యా శాఖ సమస్యలపై ఇంచార్జి ఎంఈఓ కె.రాజకుమార్‌ను నిలదీశారు. డ్రెయినేజీ భూములు ఆక్రమణలకు గురవుతున్నా పట్టించుకోవడం లేదని సర్పంచ్ పేర్కొనగా..ఆక్రమణలకు గురైన ట్లు చెబుతున్న భూమి తమ పరిధిలో ఉందో లేదో పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఏఈ తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలకు అధికారుల నుంచి సరైన సహకారం ఉండట్లేదని నిరసన వ్యక్తం చేస్తూ సర్పంచ్ నాగేశ్వరరావు వాకౌట్ చేశారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ అరుణ కుమారి, అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఆసక్తికరంగా క్రికెట్ పోటీలు

మోపిదేవి: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల స్థాయిలో మోపిదేవి జెడ్పీ పాఠశాల ఆవరణలో క్రికెట్ పోటీలు ఆసక్తికరంగా సాగుతున్నాయి. నిర్వాహకులు మలిశెట్టి శ్రీనివాసరావు, కారుమూరి శివనాగరాజు మాట్లాడుతూ శుక్రవారం చల్లపల్లి జట్టు, చెరుకుపల్లి జట్టు తలపడ్డాయన్నారు. తొలుత బ్యాటింగ్ చేసిన చెరుకుపల్లి జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 154 పరుగులు చేసిందని చెప్పారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చల్లపల్లికి చెందిన రాముడుపాలెం జట్టు నిర్ణీత 12 ఓవర్లకు గాను 6 వికెట్లు కోల్పోయి 58 పరుగులు మాత్రమే చేయగలిగిందన్నారు. చెరుకుపల్లి జట్టు విజయం సాధించగా పుష్పాల గోపి 41 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు గెలుపొందాడు. గొరిపర్తి ఏసుబాబు మెమెంటోను గోపీకి అందించారు.



మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందుకుంటున్న గోపి

అసత్య ప్రచారం మానుకోవాలి

కోడూరు: తీరప్రాంత గ్రామాల్లో ప్రజలు దాహం కేకలతో అల్లాడుతున్నారని టీడీపీ నేతలు చేస్తున్న అసత్య ప్రచారం మానుకోవాలని వైఎస్సార్ సీపీ జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకట సత్యనారాయణ అన్నారు. మండలంలోని రామకృష్ణాపురం పంచాయతీలో ప్రజలకు తాగునీరు లేదంటూ పలువురు టీడీపీ నాయకులు సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయడంపై మండల నేతలు ఆగ్రహం వ్యక్తంచేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత పంచాయతీలో 15 చేతి పంపులను ఏర్పాటు చేసి తాగునీటి కష్టాలు తీర్చిందని చెప్పారు. ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీటిని అందించడంతో పాటు జల్ జీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికి కుళాయిని ఏర్పాటు చేశామన్నారు. వైఎస్సార్ సీపీ బీసీ కన్వీనర్ చేబోయిన కృష్ణారావు, రామకృష్ణాపురం పంచాయతీ నేతలు దేవనబోయిన ప్రసాద్, పేరె శ్రీనివాసరావు, కొప్పనాతి ఈశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి

గూడూరు ఎంపీపీ మధుసూదనరావు

గూడూరు: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గ్రామ స్థాయిలో విజయవంతమయ్యేందుకు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు అన్నారు. గూడూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఆర్బీకే, పీఏసీఎస్ చైర్మన్లు కొందరు అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమాచారం కూడా తమకు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ స్థాయిలో ప్రజాప్రతినిధులుగా ఉన్న తమకే ప్రభుత్వ కార్యక్రమానికి సంబంధించిన సమాచారం లేకపోతే ప్రజలకు ఏం చెబుతామని తరకటూరు ఎంపిటీసీ సభ్యుడు జక్కా ధర్మారాయుడు, గండ్రం సర్పంచి గుడివాడ సుబ్రహ్మణ్యేశ్వరరావు అధికారుల తీరును సభ దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులను కలుపుకుని పనిచేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. పలు శాఖల అధికారులు సమావేశానికి గైర్హాజరు కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైస్ ఎంపీపీలు నేతల కుటుంబరావు, పిచ్చుక గంగాధరరావు, ఆర్బీకే చైర్మన్ పర్ణం పెదబాబు, ఎంపీడీఓ డి.సుబ్బారావు, తహసీల్దార్ జి.విజయప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పీఏసీఎస్ చైర్మన్లు, ఆర్బీకే చైర్మన్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆధునిక పరిజ్ఞానంతో వ్యవసాయం లాభసాటి

పెడన: ఆధునిక పరిజ్ఞానంతో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోందని, దానిని సద్వినియోగం చేసుకుని రైతులు లాభాలబాట పట్టాలని పెడన మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు కాగిత వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక పెడన మార్కెట్ కమిటీ హాల్‌లో మండల వ్యవసాయ సలహా సంఘ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మందులు పిచికారీ చేయడానికి కిసాన్ డ్రోన్స్‌ను సబ్సిడీపై ప్రభుత్వం అందజేస్తోందన్నారు. పంట కోత యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం అర్హులైన రైతులకు జీలుగ, పిల్లిపెసర, పచ్చిరొట్ట విత్తనాలను 50 శాతం సబ్సిడీపై అందించారు. మాజీ ఎంపీపీ రాజులపాటి అచ్యుతరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు గరికిపాటి వెంకట రామానాయుడు, ఏఓ జీవీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చిలకలపూడి(మచిలీపట్నం): విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం నగరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ ఎం. భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు చెమ్మనగిరిపేట, కోనేరుసెంటర్, గొడుగుపేట, మూడు స్తంభాల సెంటర్‌లో, ఉదయం 7.30 నుంచి 11.30 గంటల వరకు బలరామునిపేట, నిజాంపేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

ఇంటర్ దరఖాస్తులకు ఆహ్వానం

మొవ్వ: ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 15వ తేదీన ప్రారంభమవుతుందని స్థానిక క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బీఎస్‌ఆర్‌వీ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీతో పాటు వృత్తి విద్యా గ్రూపులైన ఎంఈటీ, ఏ అండ్ టీ, ఓఏఎస్ గ్రూపుల్లో 80 సీట్లు చొప్పున అందుబాటులో ఉంటాయని తెలిపారు. విద్యార్థులు నేరుగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రజలకు మేలు

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

పర్రచివర(నాగాయలంక): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలకు మేలు జరుగుతోందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. ఎమ్మెల్యే, ఆయన తనయుడు సింహాద్రి వికాస్‌తో కలిసి శుక్రవారం పర్రచివర సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. 550 గృహాలను సందర్శించి సంక్షేమ పథకాల లబ్ధిని స్థానికులకు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నివర్గాల సంక్షేమానికి, రాష్ట్రాభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో రైతులు, మహిళలు అన్నివర్గాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్రంలో ఎస్సీలు, బీసీలు లాంటి అల్పాదాయ వర్గాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేయడాన్ని చంద్రబాబు జీర్ణించుకోలేక కుటిల ప్రచారంతో ఆయా వర్గాలను మభ్యపెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. జెడ్పీటీసీ మోకా బుచ్చిబాబు, నియోజకవర్గ సచివాలయాల కన్వీనర్ మద్ది వెంకట నారాయణ (చిన్నారి), వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భోగాది వెంకట శేషగిరిరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు తోట సాయిబాబు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పరిశె యేసయ్య, గుంటూరు సురేష్, ఆర్ఐ నరహరిశెట్టి నందు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

ఘంటసాల(అవనిగడ్డ): రైతు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. ఘంటసాల మండలం శ్రీకాకుళంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే సింహాద్రి ప్రారంభించి మాట్లాడారు. రైతులకు మద్దతు ధర కల్పించాలన్న సంకల్పంతో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అకాల వర్షాలతో నష్టపోయిన మొక్కజొన్న పంట వివరాలను అధికారులు సేకరిస్తున్నారని చెప్పారు. అనంతరం రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను ఎమ్మెల్యే సింహాద్రి అందజేశారు. ఏఓ కె. మురళీకృష్ణ, ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావ్, జెడ్పీటీసీ తుమ్మల మురళీకృష్ణ, తహసీల్దార్ బి. రామానాయక్, మొవ్వ ఏడీఏ ఎస్. శ్యామల, మండల సచివాలయ కన్వీనర్ వేమూరి ప్రవీణ్, పీఏసీఎస్ అధ్యక్షుడు తాతినేని వెంకట కృష్ణారావు, పరుచూరి రామకృష్ణ, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

కోనేరుసెంటర్: జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం నిర్వహించనునట్లు కృష్ణా జిల్లా ఎస్పీ పి. జాషువా తెలిపారు. రాజీ మార్గమే రాజమార్గంగా భావించి ఫిర్యాదుదారులు, నిందితులు తమ తమ కేసులను సామరస్యంగా పరిష్కరించుకునేందుకు కృషి చేయాలన్నారు. కక్షిదారులకు సత్వర న్యాయం జరిగేందుకు లోక్ అదాలత్ దోహదపడుతుందన్నారు. ఏడాదిలో నాలుగు పర్యాయాలు జరిగే ఈ లోక్ అదాలత్‌ను శనివారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. కక్షిదారులకు ఎటువంటి ఖర్చు లేకుండా సత్వర న్యాయం అందించటమే లోక్ అదాలత్ లక్ష్యమన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులకు సంబంధించి ఇరుపక్షాలకు కౌన్సెలింగ్ నిర్వహించి కేసుల పరిష్కారానికి అధికారులు తమ వంతు కృషి చేయాలని సూచించారు.

ముగిసిన జాతీయ సర్వే

బంటుమిల్లి: మణిమేశ్వరం గ్రామంలో సిగ్మ రీసెర్చ్ కన్సల్టెన్సీ ఏజెన్సీ మూడు రోజులుగా జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే నిర్వహించింది. ఈ సర్వే శుక్రవారంతో ముగిసింది. ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ పాపులేషన్ సంస్థ క్షేత్ర స్థాయిలో సర్వే చేపట్టింది. గ్రామ, పట్టణ స్థాయిలో పలు దశల్లో ఇంటి మ్యాపింగ్, జాబితాలను సిద్ధం చేసి కుటుంబ సభ్యుల ఆరోగ్య సమాచారాన్ని నివేదికలో పొందుపరిచింది.